క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల తనిఖీ


తనిఖీ చేస్తున్న తహసీల్దార్ పార్వతి

చినగంజాం: చినగంజాం పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లను తహసీల్దార్, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ పార్వతి శనివారం సందర్శించి తనిఖీ చేశారు. చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలోని 275, 276, 277 పోలింగ్ స్టేషన్‌లు, అంబేడ్కర్ నగర్ రైతు భరోసా కేంద్రం పోలింగ్ స్టేషన్ నంబర్ 278, మూలగాని వారిపాలెం గ్రామ సచివాలయం పోలింగ్ స్టేషన్ నంబర్ 279, ఎంపీపీ స్కూల్ 280, రాంచంద్రనగర్ ఎంపీపీ స్కూల్ పోలింగ్ స్టేషన్ 281, పెద పల్లెపాలెం జెడ్పీహెచ్ స్కూల్ పోలింగ్ స్టేషన్ నంబర్ 282, సోపిరాల ఎంపీపీ స్కూల్ పోలింగ్ స్టేషన్ నంబర్ 272,273, 274లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మసీదుల వద్ద సౌకర్యాల కోసం వినతి


ఏడీకి వినతి పత్రం అందిస్తున్న ముస్లింలు

మార్టూరు: మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో మసీదు, ఈద్గా వద్ద కరెంటు స్తంభాలు, విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని చిమ్మిరిబండ గ్రామంలో మక్కా మసీదు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో కరంటు ఏడీ జే సురేంద్రబాబుకు శనివారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ గద్దం మస్తాన్‌వలి, మక్కా మసీద్ కమిటీ సభ్యులు ముత్తువల్లి మస్తాన్‌వలి, కమరిముల్లా, షేక్ సుభాని, నాగు, మీరావలి, ఆదాం వలి, షేక్ మస్తాన్ వలి, మసీదు మౌజన్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల కోసం దరఖాస్తు

మేదరమెట్ల: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల సభ్యులకు కుట్టు మిషన్లు అందజేయాలని ఏపీఎం అనూరాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాకీ, గురు, ఉషా కంపెనీలకు చెందిన కుట్టు మిషన్లు అందుబాటులో ఉన్నాయని, బ్యాంకు రుణం ద్వారా కానీ స్త్రీనిధి ద్వారా కానీ రూ.55 వేలకు అందజేస్తారన్నారు. సభ్యులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలని ఏపీఎం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

బల్లికురవ: ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు రూపొందించిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్‌అహ్మద్ అన్నారు. శనివారం చెన్నుపల్లి గ్రామంలో తల్లి పాల విశిష్టతను బాలింతలు, గర్భిణులకు తెలియజేసి వైఎస్సార్ సంపూర్ణ పోషణ్ టేక్ హోమ్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏల్చూరి శివపార్వతి పౌష్టికాహార కిట్లు సద్వినియోగ పరుచుకోవాలన్నారు. కూకట్లపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆరుగురు బాలింతలు, గర్భిణులకు సొసైటీ అధ్యక్షుడు అంజిరెడ్డి చేతుల మీదుగా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బల్లికురవ ఎంపీటీసీ పీ.రాజేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు కల్యాణి, రాణి, సుశీల, సచివాలయ సిబ్బంది స్థానిక నేతలు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌కు బల్లలు అందజేత

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు మాలాది శ్రీనివాసరావు స్థానిక పోస్టాఫీస్‌కు రూ. 8500 విలువ చేసే రెండు చెక్క బల్లలు శనివారం అందజేశారు. అనంతరం దాత శ్రీనివాసరావును రోటరీ పోస్టల్ సిబ్బంది అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చిన్ని మురళీ కృష్ణ, సెక్రటరీ చప్పిడి వీరయ్య, అసిస్టెంట్ గవర్నర్ అద్దంకి లెవీ ప్రసాద్, పోస్ట్ మాస్టర్ డీ. రవీంద్రబాబు, పోస్టల్ ఇన్స్‌స్పెక్టర్ ఎల్ విష్ణు, పోస్టల్ అసిస్టెంట్ ఆర్వీ రాఘవరావు, దేవపాలన, పుట్టంరాజు శ్రీరామ చంద్ర మూర్తి, పసుపులేటి ఆంజనేయులు, పీఎల్వీ నరసింహారావు, కొల్లా భువనేశ్వరీ, షేక్ మహమ్మద్ రఫీ, అంజాద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

రజక విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

చినగంజాం: పదో తరగతిలో మెరిట్ సాధించిన రజక విద్యార్థులు నగదు ప్రోత్సాహక బహుమతి కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఒంగోలు రజక విద్యా సేవా సంఘం నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రజక విద్యా సేవా సంఘం ఆధ్వర్యంలో 2023 మార్చిలో 450 మార్కులు పైన వచ్చిన పాత ప్రకాశం జిల్లా రజక విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారికి ప్రతి ఒక్కరికి రూ.5 వేలు వంతున నగదు నగదు బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు వివరాలు పంపని అర్హులైన విద్యార్థులు 98498 58395కు వాట్సప్ ద్వారా పంపాలని ప్రకటనలో కోరారు. కార్యక్రమం ఒంగోలులో ఈనెల 13వ తేదీ ఆదివారం ఎస్‌వీఎస్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


పాత పీహెచ్‌సీ భవనం



ప్రారంభానికి సిద్ధంగా నూతన భవనం

నాడు దైన్యం.. నేడు ధైర్యం

- యద్దనపూడి పీహెచ్‌సీకి మహర్దశ
- కార్పొరేట్ స్థాయి సౌకర్యాలతో పీహెచ్‌సీ నిర్మాణం
- రూ.1.75 కోట్లతో నిర్మాణ పనులు పూర్తి
- తీరనున్న రోగుల వెతలు


రోగులు వేచిఉండే విశాలమైన హాలు

యద్దనపూడి: ఒకప్పుడు వైద్యం చేయించుకోవాలంటే భయపడేవారు. గత పాలకులు ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకోకుండా గాలకొదిలేశారు. విద్య, వైద్యాన్ని పూర్తిగా మరిచి రోగుల ప్రాణాల తీశారు. కాని నేడు ఆపరిస్థితి మారింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చి దేశంలో చరిత్ర సృష్టించాడు. అదే క్రమంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం జగన్ సొంతం చేసుకున్నాడు. విలేజ్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, ఇంటింటికి వైద్యం, తదితర కార్యక్రమాలు చేపట్టి రోగుల పాలిట ప్రాణదాత అయ్యాడు. చిన్న రోగం వస్తే పట్టణాలకు పరిగెత్తకుండా ఊరిలోనే ఇంటివద్దకు డాక్టర్ వచ్చి పరీక్షించే వ్యవస్థను ఏర్పాటు చేసింది ప్రభుత్వం.

అడుగడుగునా గత పాలకుల నిర్లక్ష్యం..

యద్దనపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన్నేళ్ల క్రితం నిర్మించిన భవనంలో కొన్ని గదులు అన్ని శిథిలావస్థకు చేరాయి. వర్షం పడితే చాలు భవనమంతా నీళ్లు కారేవి. దీంతో వైద్యసిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చేది. దీంతో పాటు ఆసుపత్రిలో ఫ్లోరింగ్ కుంగి విషసర్పాలు సైతం దాట్లో నివసించే దుస్థితి నెలకొంది. కాసేపు ఆసుపత్రి ఆరుబయటైనా నిలబడదామంటే ఆసుపత్రి చుట్టూ చిల్లచెట్లతో నిండిపోయి అపరిశుభ్రంగా ఉండేది. ఇలా ఎన్నో ఏళ్లుగా ఆసుపత్రిలోని సిబ్బందితో పాటు వైద్యం రోసం వచ్చే రోగులు కూడా తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వచ్చేది. గత ప్రభుత్వ హయంలో ఉన్న పరిస్థితులకు చెక్ పెడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో నాడు–నేడు కార్యక్రమం ద్వారా నూతన పీహెచ్‌సీ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సుమారు రూ.1.75 కోట్ల నిధులతో నూతన పీహెచ్‌సీ భవనాన్ని సకల హంగులతో నిర్మించారు.

ఆధునిక హంగులతో నిర్మాణం..

గత పీహెచ్‌సీ భవనాన్ని 2001లో నిర్మించారు. అయినా ఆ భవనం చెరువు పక్కనే ఉండటంతో నేల మెతకబారి పునాదులు సైతం కుంగిపోయి భవనం గోడలు బీటలు వారి శిథిలావస్థకు చేరుకుంది. దీంతో వైద్యసేవలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎనిమిదేళ్ల క్రితం వైద్యారోగ్యశాఖ ఇంజినీరింగ్ అధికారులు భవనాన్ని పరిశీలించి భవనం మరమ్మతులకు సైతం పనికిరాదని కొత్త భవనం నిర్మించాలని ఉన్నతాధికారులకు తెలియజేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకున్న పాపానా పోలేదు. నాడు–నేడు పనుల్లో భాగంగా పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.75 కోట్లతో నూతన భవన నిర్మాణం పూర్తిచేశారు. సుమారు 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం చేపట్టారు. ఇందులో ఇద్దరు వైద్యాధికారులతో పాటు ఆయుష్ వైద్యులకు మూడు వేర్వేరు గదులతో పాటు పురుషులకు, మహిళలకు వేర్వేరుగా జనరల్ వార్డులు, ఆపరేషన్ థియేటర్, స్టాఫ్ నర్సుల కోసం ప్రత్యేక గది, మెడిసిన్ స్టోర్, ల్యాబ్, ఆసుపత్రికి వచ్చే రోగులకు మరుగుదొడ్లు, ఆసుపత్రి ఆహ్లాదకరమైన వాతావరణం తలపించేలా పచ్చనిచెట్లు వంటి సౌకర్యాలను చేపట్టారు. మరో 20 రోజుల్లో నూతన పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభించనున్నారు.


నూతన ఆసుపత్రికి వచ్చిన ఫర్నిచర్

తగినంత సిబ్బంది..

గతంలో పాత ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ వంటి సౌకర్యాలు లేకపోవటంతో ప్రసవాలకు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు మార్టూరు, లేదా చిలకలూరిపేట ఆసుపత్రులకు వెళ్లేవారు. దానికి విరుద్ధంగా ప్రస్తుతం నూతన భవన నిర్మాణంతో పాటు ఆసుపత్రిలో ఇద్దరు వైద్యాధికారులు, ఫార్మసిస్టు, స్టాఫ్ నర్సులు ముగ్గురు, ల్యాబ్ టెక్నీషియన్, సీనియర్ అసిస్టెంట్, ఎఫ్ఎల్ఓ, సీహెచ్ఓ, ఎంపీహెచ్ఓ, హెల్త్ సూపర్‌వైజర్లు ఇద్దరు, హెల్త్ విజిటర్, ఏఎన్ఎమ్‌లు, ఆశలు తగినంతమంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు. గతంలో ఓపీ 40 నుంచి 50 మాత్రమే ఉండగా ప్రస్తుతం 80 నుండి 100 మంది వరకు ఓపీలు నమోదవుతున్నాయి. నూతన పీహెచ్‌సీ భవనం ప్రారంభిస్తే గ్రామీణప్రాంత ప్రజలకు మరింత మేలైన వైద్యసేవలు అందుతాయి. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

> **త్వరలో నూతన పీహెచ్‌సీ ప్రారంభం..**
>
> 
>
> ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఆసుపత్రిలో తగినంతమంది సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికి రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందించలేకపోయాం. నూతన భవనం పూర్తయింది కావునా త్వరలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తాం. చుట్టు పక్కల ప్రజలు, రోగులు ఏచిన్న సమస్య వచ్చినా ఆసుపత్రికి రావచ్చు. వైద్యం అందించడానికి ఎప్పుడూ మేం అందుబాటులో ఉంటాం.
>
> – సుభాషిణి, పీహెచ్‌సీ వైద్యాధికారి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పర్యావరణ రక్షణపై కరపత్రాలు విడుదల చేస్తున్న అతిథులు


చీరాల అర్బన్: పర్యావరణాన్ని పరిరక్షించకుంటే మానవాళి మనుగడ రానున్న దశాబ్దంలో ప్రశ్నార్థకమవుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వై.భాస్కర రావు అన్నారు. శనివారం గౌతమి విద్యాసంస్థల సౌజన్యంతో డిగ్రీ కాలేజీ ఆవరణలో ప్రకృతి పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ, ప్రజలందరి కర్తవ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 21వ శతాబ్దపు అతి పెద్ద సవాలుగా పర్యావరణ పరిరక్షణ సమస్య ముందుకు వచ్చిందన్నారు. పర్యావరణ పరిరక్షణకు బలమైన ప్రజా ఉద్యమం రావాలన్నారు. ఇది ప్రజలందరి బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ కర్తవ్యమని అన్నారు. అడవుల నరికివేత, పట్టణీకరణ, ప్రకృతి వనరుల విధ్వంసం, విచ్చలవిడిగా ప్లాస్టిక్ వాడకం వలన నదీజలాలు, సముద్ర జలాలు కాలుష్యంతో పర్యావరణ సమస్య ఎక్కువైందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, చీరాల అభివృద్ధి సాధన సమితి, నేషనల్ గ్రీన్ కోర్, ఘంటసాల చైతన్య వేదిక, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధ్యం


గ్రామదర్శినిలో మాట్లాడుతున్న సీఐ

బల్లికురవ: గ్రామాల్లోని ప్రజలు ఐక్యతతో ప్రశాంతంగా జీవించాలని సంతమాగులూరు సీఐ ప్రభాకర్ కోరారు. గ్రామదర్శినిలో భాగంగా శనివారం సాయంత్రం ఉప్పుమాగులూరు గ్రామంలో గ్రామస్తులతో మాట్లాడారు. ఐక్యతతో సాధించలేనిది ఏది లేదని పోలీసు శాఖ తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. పోలీసులు ప్రజలతో మమేకం అవుతున్నారన్నారు. గ్రామ అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన కోరారు. చిన్న విషయాలకు ఘర్షణ పడటం పోలీ స్టేషన్‌కు రావటతో డబ్బు, సమయం వృథా అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రామాంజినేయులు

జే.పంగులూరు: మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో శనివారం ఒంగోలు కిమ్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మందికి కంటి లోపాలు ఉన్నట్లు గుర్తించారు. వీరికి శుక్లాలు, పొరలు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో షుగరు, బీపీ, సాధారణ వ్యాధులకు డాక్టర్ రామాంజినేయులు వైద్య సేవలు అందించారు. రోగులకు సరిపడా మందులు అందించారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి అవసరం


ఎస్సైతో మాట్లాడుతున్న సీఐ సూర్యనారాయణ

ఇంకొల్లు(చినగంజాం): పెండింగ్‌లో ఉన్న కేసులపై ఇన్‌స్పెక్టర్‌లు దృష్టి పెట్టాలని ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ సూచించారు. శనివారం ఇంకొల్లు సర్కిల్ పరిధిలోని ఇంకొల్లు, చినగంజాం, కారంచేడు పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, స్టేషన్ రైటర్స్, కానిస్టేబుళ్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పెండింగ్‌లో ఉన్న కేసులపైన అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్‌పై చర్చించి ప్రత్యేకంగా అధికారులు దృష్టి పెట్టాల్సిందిగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే నాయబ్ రసూల్, కే సురేష్, శ్రీనివాసరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో 192 దొంగ ఓట్లు


కృష్ణమోహన్, ఉప సర్పంచ్

పర్చూరు (చినగంజాం): మండలంలోని దేవరపల్లిలో 192 దొంగ ఓట్లు ఉన్నాయని గ్రామ ఉప సర్పంచ్ కోకల కృష్ణమోహన్ అన్నారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఆమంచితో సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. దేవరపల్లిలో 148వ నెంబర్ పోలింగ్ కేంద్రం పరిధిలో 192 దొంగ ఓట్లు నమోదై ఉన్నట్లు తెలిపారు. వివాహమై వెళ్లిన వారు, ఇతర దేశాలు, రాష్ట్రాలలో నివాసముంటున్నవారు, చనిపోయిన వారు తదితరుల ఓట్లు 192 గుర్తించినట్లు ఆయన వివరించారు. అన్నంబొట్లవారిపాలెంలో కూడా గతంలో అక్రమంగా దొంగ ఓట్లు నమోదు చేసినట్లు పార్టీ నాయకురాలు గోరంట్ల శివపార్వతి ఆరోపించారు. పోలింగ్ కేంద్రం 153లో 200 వరకు దొంగ ఓట్లు నమోదై ఉన్నట్లు గుర్తించామన్నారు. బోడవాడ గ్రామంలో ఉన్న రెండు పోలింగ్ కేంద్రాలలో కూడా అధికంగా దొంగ ఓట్లు నమోదైనట్లు, 109,110 పోలింగ్ కేంద్రాల పరిధిలో 275కి పై చిలుకు దొంగ ఓట్లు నమోదైనట్లు పార్టీ నాయకులు ముప్పాళ్ల రాఘవ తెలిపారు. వాటిని వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి


రికార్డులు పరిశీలిస్తున్న డిటీ మస్తాన్‌రావు

యద్దనపూడి: పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు అంకిత భావంతో తమ విధులు సక్రమంగా నిర్వహించాలని డిప్యూటీ తహశీల్దారు మస్తాన్‌రావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గన్నవరంలో సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు, కార్యాలయంలోని పెండింగ్ సమస్యలను పరిశీలించారు. ప్రతి సిబ్బంది బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా నమోదు చేయాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తదుపరి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను బాలింతలకు, గర్భిణులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

9వ తేదీ నుంచి 'నా మట్టి–నా దేశం'


కార్యదర్శులకు సూచనలందిస్తున్న ఎంపీడీవో నేతాజీ

చీరాల టౌన్: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ, మండల స్థాయిలో నిర్వహించనున్న 'నా మట్టి–నా దేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కే నేతాజీ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, సచివాలయాల సెక్రటరీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఈనెల 9 నుంచి 15 వరకు గ్రామస్థాయిలో, 16 నుంచి 20 వరకు మండల స్థాయిలో కార్యక్రమం జరుగుతుందన్నారు. అన్ని సచివాలయాలు, పంచాయతీల్లో విధిగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అందించారు. అలానే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలనకు చర్యలు తీసుకుని గ్రామాల్లో చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా వాటర్ ట్యాంకులు, ఆర్వో ప్లాంట్లు మరమ్మతులు చేయించి మంచినీరు ప్రజలకు అందించాలన్నారు. పంచాయతీల్లో నిర్మాణాల్లో ఉన్న సచివాలయాల శాశ్వత భవనాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు త్వరగా చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఈవోఆర్డీ మురళీ బాపూజీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సెక్రటరీలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లిన న్యాయవాదులు


యాత్రకు వెళ్తున్న న్యాయవాదులు

చీరాల రూరల్: చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శనివారం కోటప్పకొండ, త్రిపురాంతకం, శ్రీశైలం పుణ్యక్షేత్రాలకు ఆధ్యాత్మిక యాత్రకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ మేరుగు రవికుమార్ మాట్లాడుతూ ప్రతినిత్యం కేసుల్లో బిజీగా ఉంటూ తలమునకలయ్యే న్యాయవాదులు ఆధ్యాత్మిక యాత్రల వలన కొంతమేరా ఒత్తిడి నుంచి బయట పడతారని చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌరవ రమేష్‌బాబు, కటకం చంద్రశేఖరరావులు హర్షం వ్యక్తం చేశారు.

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

కారంచేడు: మీ పరిధిలోని ఉన్న హైరిస్క్ గర్భిణుల పట్ల మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జెస్సీరాణి అన్నారు. శనివారం ఆమె ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో నిర్వహించి సమావేశంలో మాట్లాడారు. రక్త హీనతతో బాధపడే వారికి అవసరమైన అన్ని రకాల పరీక్షలతో పాటు, ఉచిత మందులు ఇచ్చి ఆహార నియమాలను తెలిపి వారి ఆరోగ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మూడో నెల నుంచి వారిలో చైతన్యం కల్పించాలన్నారు. మంచి ఆహారం, మందుల ద్వారా హిమోగ్లోబిన్ శాతంను పెంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌వీలు, సైపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీల విచారణలో అలసత్వం వద్దు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకంలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబు దారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ పి.సురేష్, ఆర్ఐలు శేఖర్, శంకర్, వీఆర్వోలు ఉన్నారు

కారు ఢీ, వ్యక్తికి తీవ్రగాయాలు


క్షతగాత్రుడిని పరిశీలిస్తున్న ఎస్సై నాగశివారెడ్డి

మేదరమెట్ల: రోడ్డు దాటుతున్న వ్యక్తిని కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయలయ్యాయి. ఈఘటన శనివారం రాత్రి మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో జరిగింది. అందిన సమాచారం మేరకు దొడ్డా ఆంజనేయులు కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జాతీయ రహదారి తమ్మవరం రోడ్డు సమీపంలో రోడ్డు దాటేందుకు ప్రయత్నిస్తుండగా ఆదే సమయంలో ఒంగోలు వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఆంజనేయులును ఢీ కొంది. దీంతో ఆంజనేయులు రోడ్డుపై పడిపోయాడు తలకు తీవ్రగాయం కాగా 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మేదరమెట్ల ఎస్ఐ పీ.నాగశివారెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తిది దైవాలరావూరుగా స్థానికులు తెలిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మందికి ఉద్యోగాలు

చీరాల అర్బన్: పట్టణంలోని వైవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 13 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఫైజర్ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో మొత్తం 52 మంది రాగా వీరిలో 13 మంది ఎంపికయ్యారు. వీరికి ప్రారంభ వేతనం రూ.12500 ఉంటుందని ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ తెలిపారు. కార్యక్రమంలో రిక్రూటింగ్ పర్సన్స్ చందు, వినోద్, సెల్వికుమార్, ఉదయ కోటేశ్వరన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

చినగంజాం: మండలంలోని పల్లెపాలెం సచివాలయం పరిధిలోని మధ్యాహ్న భోజన పథకాన్ని తహశీల్దార్ పార్వతి శనివారం పరిశీలించి తనిఖీ చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, నాణ్యమైన భోజనంతో పాటు రుచిగా కూడా ఉండాలని సూచించారు. అనంతరం ఆమె భోజనాన్ని రుచి చూసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు అధికారులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి

చీరాల టౌన్: ఇంటి పట్టా పొందిన ప్రతి లబ్ధిదారులు ఇంటినిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ ఎ.గోవిందరెడ్డి సూచించారు. మండలంలోని చీరాలనగర్ పంచాయతీలోని జగనన్న లే అవుట్‌లో చేస్తున్న నిర్మాణ పనులను డీఈ శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా హౌసింగ్ డీఈ మాట్లాడుతూ లబ్ధిదారులు ఉత్సాహంగా నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు సాయం చేస్తున్నట్లు తెలిపారు. అంతేగాక పొదుపు మహిళలకు అదనంగా వైఎస్సార్ కేపీ ద్వారా రూ.35 వేలు అదనపు రుణం అందిస్తుందని చెప్పారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.